నీ పెళ్ళెప్పుడు పాపా?

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

[విశ్వపతి ఒంటరిగాడు. బిడ్డలు పాపలు లేరు. ఆ యింట్లో నౌకరు కేశవులుతో అతను కనుపిస్తుండేవాడు. రమామణితో పరిచయము ఏర్పడిన నాటినుండి అతనిలో నూతన ఉత్సాహం, అణగారి పోయిందేమోననుకుంటుండిన ఆనందం చిగిర్చినవి. రమామణి ప్రతి దినం బడికి పోతూ దారిలోనున్న విశ్వపతి యింటికి వెళ్లి కొంతకాలం గడిపి పోవడం అతనికెంతో ఆనందంగానుండేది. రమామణికి ప్రతిదినం బిస్కెట్లు, తినుబండారాలు తెచ్చి బలవంతంగా యిచ్చి పంపడంతో బాటు చినిగినదుస్తులతో నున్నప్పుడు దుస్తులు కూడ కొని తెచ్చియిచ్చేవాడు ఒక రోజున రమామణి వద్దన్నా తాను తెచ్చిన బంగారు గొలుసును మెళ్లోవేసి యింటికి పంపించాడు. ఆ నాటినుండి రమామణి విశ్వపతి యింటికి రావడముకాని, కంటికి కనుపించడము కాని నిలిచి పోయింది. దాంతో విశ్వపతికి ఆందోళన అధికమయి రమామణి యింటికి వెళ్లి మంచముమీద జ్వరముతో పండుకొని యున్న రమామణిని చూచాడు – యికచదువండి]

(గతసంచిక తరువాయి)

ఆమె చెంపలమీద చెయ్యివేసి నిమురుతూ "జ్వరంవచ్చిందా మణీ!" అన్నాడు ఆప్యాయంగా విశ్వపతి.

అంతలో వెనక అడుగుల చప్పుడువినిపించింది. చటుక్కున తలత్రిప్పి చూశాడు విశ్వపతి. ఒక ముప్పయిఏళ్ల ఆమె నిలబడివుంది. విశ్వపతికి తను చేసిన సాహసకార్యం గుర్తువచ్చింది. తను ఎంత అసభ్యంగా ప్రవర్తించిందీ తలంచుకుని లేచి నిలబడ్డాడు తలవంచుకుని.

"పర్వాలేదు. కూచోండి." అంది ఆమె.

"నేను యింతచనువుగా ప్రవర్తించినందుకు. క్షమించండి." అని తిరిగికూర్చున్నాడు విశ్వపతి. ఒక నిమిషంవరకూ ఎవరూ మాట్లాడలేకపోయారు.

"అమ్మాయికి జ్వరం వచ్చిందా?"

"అవును. మీరుచేసిన పనివల్లనే అదియీస్థితికి వచ్చింది" అన్నదామె.

"నేనా?" అంటూ విస్తుపోయాడు విశ్వపతి.

"అవును"

"మీరు మణి తల్లిగారనుకుంటాను."

"అవును"

"నేను చేసిన పనివల్లనే ఆమెకీ స్థితి సంభవించిందన్నారు. అదేలాగో తెలుసుకోవచ్చా?" అని వినయంగా ప్రశ్నించాడు విశ్వపతి.

"మీరు అంత విలువగల గొలుసు దానికెందుకిచ్చారు? అది చూసి వాళ్ల నాన్నగారు మండిపడ్డారు..." అని మణి తల్లి యింకేమో చెప్పబోయింది.

"నేను వేరే ఉద్దేశంచేత యివ్వలేదు! మణి మీది ప్రేమచేత" అన్నాడు విశ్వపతి ఆమెను ఆపి.

"నిజమే. మేమూ అందుచేతనే యిన్నాళ్లూ వూరుకున్నాము. మీరు దానికి రోజూ ఏదో ఒకటి యిచ్చి పంపుతున్నా వద్దంటే మీ మనస్సు కష్టపడ్తుందేమోనని ఏమీ అభ్యంతరం చెప్పలేదు. ఆవేళ పట్టుగొన్ను యిచ్చినప్పుడుకూడా ఆయన మండిపడ్డారు. మీ వద్దకు వచ్చి యీవిషయం గట్టిగా అడుగుతానన్నారు; కాని – ఆయనకు పిల్లలంటే ప్రేమ వుండి వుంటుంది. అందుచేతనే యిచ్చి వుంటారు. అనవసరంగా తొందరపడబోకండి" అని నేనే ఆయన్ని ఆపాను.

మణి తల్లి చెప్పుకుపోతూంది. విశ్వపతి తలవంచుకుని వింటున్నాడు.

అంతలో మణి కళ్లుతెరిచింది. విశ్వపతి ఆ పిల్ల వంక చూసి "పాపా! ఎలావుంది?" అనడిగాడు.

"బా...బా...యి" అన్నదిమణి. విశ్వపతి ఆమెవంక ఆత్రంగా చూచాడు. తిరిగి మణి కళ్లు మూసుకుపోయాయి.

"తర్వాత మీరు నిన్న ఆ గొలుసు యిచ్చినప్పుడుకూడా యిటువంటి రభసే జరిగింది. మణిని వెంటనే యిచ్చేసి రమ్మన్నారు. అదెంతయినా చిన్నపిల్ల. ఇవ్వనని మొండిపట్టుపట్టింది. వాళ్ల నాన్నగారు కోపంచేత దాన్ని చావగొట్టారు. పసిపిల్ల ఏంతట్టుకోగలదు? సాయంత్రానికల్లా నూటమూడు జ్వరం. ఆయన యింతవరకూ పిల్లమీద చెయ్యిచేసుకుని ఎరుగరు; తర్వాత ఎంతగానో బాధపడ్డారు. ఇదంతా ఎందుకని చెప్తున్నానంటే మీకు ఏ కారణంచేతనయినా ప్రేమవుండవచ్చు. అందుకని అటువంటి విలువగల వాటిని చీటికీ మాటికీయిస్తూ వుండటం ఆయనకేమీ యిష్టంలేదు. ఇక ముందెప్పుడూ అలాచేయరని నా నమ్మకం" అంటూమణి తల్లి గిరుక్కున లోపలకు వెళ్లిపోయింది.

విశ్వపతి ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. తను నిజంగా అపరాధంచేశాడా? తనలో వాత్సల్యం వుంటే వుండవచ్చు. ఆ వాత్సల్యాన్ని దాచుకోలేక ఏదయినా యివ్వటం తప్పా?

మణి తల్లి గదిలోకి వచ్చింది మళ్లీ. విశ్వపతి ఆమె వంక చూశాడు. "ఇదిగో మీరు యిచ్చిన గొలుసు. యిలా ప్రవర్తిస్తున్నానని ఏమీ కష్టం పెట్టుకోకండి. ఏంచెయ్యగలను? విధిగా యిలా అనవల్సివస్తుంది" అంటూ దానిని అందించింది. విశ్వపతి లేచి నిల్చుని అందుకున్నాడు.

"నా ప్రవర్తనవల్ల మీకు కష్టం కలిగితే క్షమించండి. మణిని నాకుతూర్తిగా భావించుకున్నాను. మీరు ఏమీ అనుకోరని యిలా చేశానుగాని దానికి ఫలితం యిలా అవుతుందని వూహించుకోలేకపోయాను. మీవారువస్తే నా క్షమాపణలు చెప్పండి" అని మణివంక ఒకసారిచూసి బయటకు వచ్చేశాడు.

మణితల్లి శూన్యంలోకిచూస్తూ నిల్చుండిపోయింది.

◆ ◆ ◆

వారంరోజులు గడిచాయి. విశ్వపతి ఆలోచనల్తో సతమతమయిపోతున్నాడు. తను. ఏ కాకి ఈ ప్రపంచంలో "నా" అని చెప్పుకోదగ్గవారు ఎవరూలేరు. తనింక ఎవరికోసం బ్రతకాలి. మొరటు

జారిపోతున్న తన జీవితంలో మణి ప్రవేశించిన తర్వాత తిరిగి ఆశ చిగిర్చింది కాని అది మూన్నాళ్ల ముచ్చట.

ఆరోజు విశ్వపతి కాఫీతాగి సావిట్లో కూచున్నాడు. ఉదయం ఏడుగంటలయింది. తను వారంరోజుల్నుంచీ బయటకి రావటంలేదు. మణికి జ్వరం తగ్గిందా? రోజూ బడికిపోతూంద్రేమో! తను చూడటంలేదు. ఇవేళ కనిపిస్తే? ...

దూరంగా మణి కనిపించింది. విశ్వపతికి కొంచం కంగారు పుట్టింది. లేచి లోపలకి పోదామనుకున్నాడు. అయినా కదల్లేకపోయాడు.

రమామణి దగ్గర కొచ్చింది. విశ్వపతి బలవంతంగా తలతిప్పుకున్నాడు. మణి యితని దగ్గరకే నడిచివచ్చింది.

“బాబాయ్”

విశ్వపతికి అటుచూడక తప్పలేదు. మణి యితనివంకేచూస్తూ నిలబడివుంది. జ్వరంవల్లనేమో మనిషి నీరసించిపోయింది.

“జ్వరం తగ్గిందా పాపా?”

“ఊఁ”

విశ్వపతికి వాత్సల్యం పెల్లుబికింది. అయినా బలవంతంమీద అణుచుకుంటూ “నామూలంగా నీకు దెబ్బలు తగిలినయిటగా పాపా?” అనడిగాడు.

“మానాన్నగారు నన్నూరికినే కొట్టారు”

“మీ యింట్లో ఏమన్నారుపాపా? నాగురించి?”

మణి ఆశ్చర్యంగా చూసింది. “ఏమీఅనలేదు. ఆ గొలుసు యిచ్చేశానని చెప్పిందమ్మ” అన్నది.

విశ్వపతి అనలేక అన్నాడు “మణీ యిక ముందు యిక్కడకి రావద్దమ్మా. మీ నాన్నగారికి కోపం వస్తుంది. పెద్దవాళ్లకి కోపమొచ్చే పనులు చెయ్యకూడదుగా. ఏం?”

“మానాన్నగారి కెందుకు బాబాయ్ కోపం?” అనడిగింది మణి అమాయకంగా.

“ఏమోనమ్మా అది నాకేం తెలుసు? మరి రేపటి నుంచీ రావుగా” మణి మనస్సు ఎంత బాధ పడుతుందో అని తను బాధపడుతూ అన్నాడు.

“రానులే బాబాయ్. నాన్నగారుకూడా వద్దన్నారు.”

ఇందాక చెప్పనిమాట యిప్పుడు చెప్పింది.

“నీకు జ్వరం పూర్తిగా తగ్గిపోయిందా పాపా?” అన్నాడు సంభాషణమార్చి విశ్వపతి.

“ఊఁ. నేనివాళే బడికిపోతున్నా”

“అయితే త్వరగా వెళ్ళమ్మా. టైమయిపోయినట్లుంది.”

మణి మెల్లిగా వెళ్లిపోయింది. విశ్వపతి హృదయం కలతలో మునిగిపోయింది. ఆమె వెళ్ళినదిక్కే చూస్తూ చాలాసేపు వుండిపోయాడు. తర్వాత భారంగా లేచి యింట్లోకి పోయాడు.

రోజులు గడుస్తున్నాయి. విశ్వపతి పూర్తిగా మారిపోయాడు. ఎప్పుడూ ఏదో దిగులు అతన్ని ఆవహించి వుండేది. ఏదో ఆలోచిస్తూనే వుండేవాడు ఎప్పుడుచూసినా. అతని ముఖంలో నిస్పృహ స్పష్టంగా కనబడేది.

రోజూ మణివచ్చేవేళకి సావిట్లో కూచుండేవాడు. మణి బడికిపోతూ యితనివంక చూసేది. ఇతను కూడా ఆ పిల్లవయిపు అప్రయత్నంగా చూసేవాడు. వెంటనే యిద్దరూ వారి చూపులు మరల్చుకునేవారు. ఆ తర్వాత ఒక్కసారయినా యిద్దరూ మాట్లాడుకోలేదు. కాని రోజూ ఉదయాన ఆ పిల్లవచ్చేవేళకి విశ్వపతి అక్కడ వుండకుండా వుండలేకపోయేవాడు.

అప్పుడప్పుడూ మణిని చూడగానే విశ్వపతి పెదవులు అప్రయత్నంగా కదిలేవి. “నీ పెళ్లెప్పుడు పాపా?” అనేమాట అతని పెదవులుదాటి బయటకురాబోయి తిరిగి ఆగిపోయేది.

ఒకొక్కక్కసారి ఆ గొలుసు తీసుకుని దానివంక చూస్తూ నిశ్చలంగావుండిపోయేవాడు. ఇంకోసారి

తన పెట్టెలోవున్న ఏదో ఫోటోతీసి హృదయానికి హత్తుకుని గంటలకొద్దీ మైమరచి పోయేవాడు.

ఈ విధంగా అతనికి రోజులు భారంగా గడుస్తున్నాయి.

◆ ◆ ◆

"మణి పెళ్ళిట బాబూ!"

రెండు సంవత్సరాల తర్వాత ఒకనాటి సాయంత్రం కేశవులు విశ్వపతితో అన్నమాటలివి.

మణి యీ రెండు సంవత్సరాలనుంచీ బడికి పోతూనేవుంది. సెలవురోజులనాడుతప్ప ప్రతి రోజూ విశ్వపతికి కనిపిస్తూనేవుంది.

పదిరోజులనుంచి మాత్రం మణి రావటంలేదు. ఎంత వద్దనుకున్నా విశ్వపతి ఆతృత పట్టలేక పోయాడు. మణికేమయిందో అని అతని హృదయం తహతహలాడింది. కేశవుల్ని పిలిచి అవతలవాళ్ళెవరికీ కష్టంకలగకుండా యీ విషయం అడిగిరమ్మని పంపించాడు. అతను వాకబుచేసి వచ్చిచెప్పిన మాట యిదీ.

విశ్వపతి అయిదు నిమిషాలవరకూ స్తబ్దుడయి పోయాడు. "ఈ విషయం ఎవర్నడిగి తెలుసుకున్నావు?" అనడిగాడు తర్వాత.

"వాళ్ళింటిప్రక్క ప్లీడరుగారింట్లో పనిచేసే వంటవాడు నాకు స్నేహితుడే. అతన్నడిగి తెలుసుకున్నాను యీ విషయం" అన్నాడు కేశవులు.

"ఎప్పుడట పెళ్ళి?"

"ఇంకో పదిరోజులు వుందిట బాబుగారూ! అందుకని మణిని బడిమానిపించేశారు"

"ఊహు" అని "సరే నువ్వెళ్ళు" అన్నాడు విశ్వపతి. కేశవులు పోబోయాడు.

కాని మళ్ళీ వెంటనే యజమాని అతన్ని ఆపి "ఉండు ఈ విషయం అడిగావా? మణి పెళ్ళి ఎవరితో చేస్తున్నారట?" అని అడిగాడు.

"పేరు తెలియదుకాని బాబూ ఆయనెవరో మొదటిభార్య చనిపోయిందిట వయస్సు నలభయి అయిదుకు తక్కువ వుండదని చెప్పాడు."

"రెండవపెళ్ళివాడికి యిస్తున్నారా?" అంటూ ఆశ్చర్యపోయాడు విశ్వపతి.

"ఊ అవునట" "అలా ఎందుక"ని అడిగితే "డబ్బులేనివాళ్ళకి అంతకంటే మంచి సంబంధాలు వస్తాయేమిటి?" అన్నాడు. "నిజమంతే బాబూ" అన్నాడు కేశవులు.

తర్వాత అతన్ని పంపివేసి ఆలోచనలోపడ్డాడు విశ్వపతి. మణిని రెండవ పెళ్ళివాడికి యిస్తున్నారా? ఆమె జీవితం యిక నాశనమయిపోవల్సిందేగా. పన్నెండేళ్ళపిల్లకి అంతకు నాలుగురెట్లు వయస్సుగలవాడికియిచ్చి పెళ్ళిచెయ్యటమా? ఎంత ఘోరం?

ఘోరం! ఏదిఘోరంకాదు? జరిగిపోయినవి తను తలుచుకోకూడదు.' తలుచుకుంటే తను బ్రతకలేడు. ఎందుకూ తనింకా బ్రతకటం? ఏంచూసుకుని? తనకేమయినా ఆప్తులున్నారా ఎవరయినా? తనుచూసి జాలిపడే వాళ్ళున్నారా? తనకెవరూ లేని యీ ప్రపంచంలో బ్రతకాలని యింకా ఎందుకూ తాపత్రయం?

మణి పెళ్ళి ఆపేదెట్లా? ఆ పెద్దవాడితో యీ చిన్న పిల్లకు పెళ్ళి జరిగిపోవల్సిందేనా? జరగకేం చేస్తుంది? తనెల్లా ఆపగలుగుతాడు? వెళ్ళి బ్రతిమాలితే? "ఆ పసికందు జీవితాన్ని భగ్నంచేయకండి" అని కాళ్ళావేళ్ళాబడితే? తనాపనిచేయలేడు. ఆశక్తి తనకులేదు.

ఆలోచనల్తో అలానే మంచంమీద వాలిపోయాడు. కళ్ళు మూసుకుపోయాయి.

గంట తర్వాత ఆ గదిలో లైటు వెలిగిద్దామని వచ్చిన కేశవులు వేళగాని వేళలో యజమాని యిలా నిద్రపోతూండటంచూసి విస్తుపోయాడు. ఆయన నిద్రకు భంగం కలుగజెయ్యటమెందుకని వెళ్ళిపోదామనుకున్నాడుగాని మళ్ళీ ఏ అనుమానం వచ్చిందో

ఆగిపోయి విశ్వపతి శరీరంమీద చెయ్యివేసి చూశాడు. నిప్పులాగ కాలిపోతూంది. వెంటనే కంగారుపడిపోయి "బాబుగారూ" అంటూ పిలిచాడు. విశ్వపతి పలుకలేదు. కేశవులికి ముచ్చెమటలు పోశాయి. వెంటనే బయటకువచ్చి తలుపులు దగ్గరకు వేసి డాక్టర్ దగ్గరకి పరిగెత్తాడు.

మరో అరగంటకల్లా డాక్టరుతోసహా కేశవులు యింట్లోకి ప్రవేశించాడు. వాళ్లు వచ్చేటప్పటికీ విశ్వపతి కలవరిస్తూవున్నాడు.

"నీ పెళ్లెప్పుడు పాపా ?"

"నేనూ వస్తాను నీతో, నన్ను విడిచి వెళ్లిపోయావుకదూ" అంటూ పదేపదే అనటం సాగించాడు. డాక్టర్ అతన్ని పరీక్షచేసి కేశవుల్ని బయటకు పిలుచుకునిపోయాడు.

"అయ్యగారికేమయింది బాబూ ?"

"జ్వరం తీవ్రంగావుంది. రెండురోజులు గడవనీ. - నావెంటరా మందిస్తాను" అంటూ కేశవుల్ని తనవెంట తీసుకుపోయాడు.

"బాబుగార్ని ఎలాగయినా బ్రతికించండి బాబయ్యా మీకెంతయినా ఋణముంటాను" అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు దారిలో.

ఆ రోజంతా జ్వరం తీవ్రంగానేవుంది విశ్వపతికి. కేశవులు ఆ రాత్రంతా మేలుకుని ఉపచర్యలు చేశాడు.

మరునాడు ఉదయం కాస్త తెలివొచ్చింది. కేశవుల్నిపిలిచి కాగితం, కలం తీసుకురమ్మన్నాడు. తెచ్చి యిచ్చిం తర్వాత ప్రయాసతో కొంతసేపు రాసి అది కవర్లో పెట్టించి కేశవులి కిచ్చేడు విశ్వపతి.

"ఏమిటి బాబూ ?" అనడిగాడు కేశవులు భయంగా.

"నేనెలాగూ యిక బ్రతకను కేశవులూ" - నా జీవితం అంతంచెందే సమయం ఆసన్నమయింది..." అన్నాడు విశ్వపతి ఆయాసంతో.

కేశవులు కళ్లనీళ్లు పెట్టుకున్నాడు - ఒక నిమిషం ఆగి "అటువంటిమాటలనకూడదు బాబుగారూ - డాక్టరుగారు నయమవుతుందని చెప్పారు."

"నీకు తెలీదు కేశవులూ -" విశ్వపతి అన్నాడు. "ఇక నేను అమ్మగారు అమ్మాయిగారూ పోయినదగ్గరకే పోతున్నాను. నేను చనిపోయింతర్వాత ఈ ఉత్తరాన్ని మణితండ్రిగారికి అందచెయ్యి. ఇంతే నేను కోరేది"

కేశవులు దుఃఖం ఆపుకోలేక పోయాడు. అతని దుఃఖం పైకి పెల్లుబికింది.

"ఏడవకు కేశవులూ. నన్ను విశ్వాసంగా ఆఖరివరకూ వెన్నంటుతూ వచ్చిందినువ్వే. నీకు నా కృతజ్ఞత"

ఆ తర్వాత విశ్వపతి మాట్లాడలేక పోయాడు. అతనికళ్లు మగతతో మూసుకుపోయాయి.

ఆ సాయంత్రమే విశ్వపతి యీలోకాన్ని విడిచి వెళ్లిపోయాడు.

♦ ♦ ♦

ఇదిజరిగిన మరునాటి సాయంత్రం రేగిపోయిన జుట్టుతో, ఉబ్బరించిపోయిన ముఖంతో కేశవులు మణి తండ్రి రామారావుగారింటికి వెళ్లాడు.

కూతురిపెళ్లి యింకా వారంరోజులేవున్నందువల్ల రామారావుగారు చాలా హడావుడిగవున్నారు. యితన్ని చూసి "ఏంకావాలి?" అంటూ ప్రశ్నించాడాయన.

"మా బాబుగారు మీకీ ఉత్తరం యివ్వమన్నారు."

"ఆయనెవరు ?"

ఆ సమయానికే మణితల్లి అక్కడకి ఏదో పనివుండివచ్చి యిదిచూస్తూ నిలబడిపోయింది.

కేశవులికి తిరిగి దుఃఖం పొర్లింది. "మా అయ్యగారు ... విశ్వపతిరావుగారు ... నిన్ననే చనిపోయారు." అన్నాడు సగంసగం మాటలతో.

రామారావుగారికిదేమీ అంతుపట్టలేదు. "ఎందుకలా ఏడుస్తావ్? విశ్వపతిరావుగారెవరో నాకుతెలీదే" అన్నాడు.

మణితల్లికి ఒకటిస్ఫురించింది. "ఏదీ ఆఉత్తరం?" అని అడిగితీసుకుని గట్టిగా చదివింది.

రామారావుగారికి

మహాశయా! నేనెవరో మీకు అంతగా తెలిసివుండదుగాని మీ అమ్మాయి మణికి బాగా తెలుసు. రెండు సంవత్సరాలక్రితం మీరు తిరగ్గొట్టిన ఆ గొలుసును యిచ్చిందినేనే. మణిని నేను అంతగా ఎందుకు చేరదీసిందీ మీకు ఆశ్చర్యంగా వుంటుంది. ఎనిమిది సంవత్సరాలక్రితం నాకూ ఒక కుమార్తె వుండేది. దాని పేరు ఇందిర. ఇందిర తల్లి చిన్నప్పుడే చనిపోయింది. అప్పట్నుంచీ నేనేదానిని సాకి పెద్దదాన్నిచేశాను. ఇందిరను నేను ఎంతో ప్రేమగానే చూసేవాడ్ని. అయితేనేం నాబుద్ధి పెడదారిపట్టింది. బంధువుల మాటలువిని వాళ్లప్రోత్సాహంచేత ఒకరెండోపెళ్లివాడికి ఆమెనిచ్చి పెళ్లిచేశాను. అదెంతగానో మొత్తుకుంది. నేను వినలేదు. ఆ సమయానికి అలా వశుడినయిపోయాను. డబ్బుకోసం ఆశించికూడా నేనాపని చేయలేదు. సరే... పెళ్లి జరిగిపోయింది. ఆతర్వాత దాని భర్త టైఫాయిడ్ జ్వరంతో మరణించటం కూడా కొద్ది కాలంలోనే జరిగింది. అప్పుడెంతగా విచారిసే ఏం లాభంకి అయినా లోకానికి జడిసి దాని రెండో పెళ్లి ప్రయత్నంకూడా చెయ్యలేదు. అది రోజూ రాత్రిళ్లు కుమిలి కుమిలి ఏడ్చేదనుకుంటాను. ఒకరోజు ఏం చెప్పను? అర్ధరాత్రిపూట భావిలో పెద్దగా చప్పుడయింది. వెళ్లి చూస్తే ఏముంది? అప్పటికే ప్రాణం పోయింది. అప్పట్నుంచీ ఒక ఏడాది జీవచ్ఛవంలాగా గడిపాను. అవూళ్లో మనశ్శాంతి లభించక యిక్కడికి వచ్చాను. ఇక్కడా చాలారోజులు పేలవంగానే గడిచాయి. కాని ఒకరోజు బడికి పోతుంటే మీ మణిని చూశాను. ఎందుకనో ఇందిర గుర్తువచ్చి నా మనస్సు కలచివేసినట్లయింది. మణినిపిలిచి స్నేహం చేసుకున్నాను. రోజూ మణినిచూస్తూ మనశ్శాంతి పొందుతూండేవాడ్ని. అయితేనేం నేను ప్రేమచేత అవీయివీయిస్తూ వుండటం అవి మీకు యిష్టంలేకపోవటం జరిగింది. అప్పట్నుంచీ మణితో మాట్లాడేందుకుకూడా వీలులేకపోయింది. ఆమెను చూస్తూ సంతృప్తి చెందేవాడ్ని. తరువాత తెలిసింది మణిపెళ్లి జరుగుతుందని. నేనెప్పుడూ అడుగుతుండేవాడ్ని ఆమెను "నీ పెళ్లెప్పుడు పాపా?" అని. దానికి సమాధానం లభించిందనుకున్నాను. కాని మణి పెళ్లి ఒక వయసు చెల్లినవాడితో అని తెలిసేటప్పటికి కంపించిపోయాను. నాస్థితిగుర్తువచ్చింది. ఆర్థికంగా మీకు శక్తిలేక విధిలేక ఆమె జీవితాన్ని నాశనమార్గంలో పెడుతున్నారు. అలాజరిగించవద్దని నా మనవి. నా ఆస్తినంతా యిదివరకే నాతదనంతరం మణికి చెందేటట్లుగా రాసి ఏర్పాటుచేశాను. ఆ ఆస్తి మీరు వెంటనే స్వాధీనం చేసుకోవచ్చు. మణి జీవితాన్ని నాశనం చేయకండి. ఆమెకు యీడూ జోడూ సరిపోయేటట్లుగానే ఒకమంచి సంబంధం చూసిచేయండి. నేను మిమ్మల్ని ప్రార్థించేదియిదే. తర్వాత ఒక విషయం. ఈ కేశవులు నన్ను విశ్వాసంతో చాలా కాలం వెన్నంటివున్నాడు. నాడబ్బుతో అతన్నిమీరు పోషించండి. నాకడసారికోరిక మన్నిస్తారని తలుస్తాను. మణికి నా ఆశీర్వచనాలు చెప్పండి విశ్వపతి. ఇంతే.

ఉత్తరం చదువుతున్న మణి తల్లికళ్లనుండి నీరు స్రవించింది. అంతా వింటున్న రామారావుగారు నిశ్చేష్టుడయిపోయాడు.

అప్పుడే అక్కడకి ఎందుకనో వచ్చిన మణిని తల్లి దగ్గరకు తీసుకుని హృదయానికి గట్టిగా హత్తుకుంది. ఆమె కంటినీరు మణితలపైన ముత్యాలులాగా జారిపడ్డాయి.